## క్లుప్తంగా

### సీఐ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎంపీ



సీఐ ఆనందరావు అంత్యక్రియల్లో పాల్గొని నివాళులర్పిస్తున్న ఎంపీ గోరంట్ల మాధవ్

**హిందూపురం టౌన్:** తాడిపత్రి సీఐ ఆనందరావు అంత్యక్రియల్లో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ పాల్గొన్నారు. మంగళవారం తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కల్‌రోడ్డు పల్లిలో సీఐ ఆనందరావు అంత్యక్రియలు జరిగాయి. సతీసమేతంగా ఎంపీ గోరంట్ల మాధవ్ సీఐ అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### ఉద్యోగం చేసే చోటే బస చేయాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శ్రీనివాస్

**పావగడ:** తాలూకాస్థాయి ప్రభుత్వ శాఖల ఉద్యోగులు తాము ఉద్యోగం చేసే చోటే బస చేయాలని తుమకూరు జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. దూర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే గ్రామీణ ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం వహించకుండా మెరుగైన సేవలందించాలన్నారు. స్థానిక తాలూకా పంచాయతీ సమితి సమావేశ మందిరంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశమై పలు సూచనలు, సలహాలిచ్చారు.

### బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేత



**మడకశిరరూరల్:** మండలంలోని బచ్చలయ్యపాళ్యానికి చెందిన పింఛన్‌దారుడు గంగాధరప్ప గుండె ఆపరేషన్ చేయించుకొని బెంగళూరులోని బంధువుల ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వలంటీర్ వినోదమ్మ బెంగళూరుకు వెళ్లి పింఛన్ అందజేశారు.

### సబ్సిడీని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆర్‌పీ నాగరాజు

**పరిగి:** స్థానిక ఐకేపీ కార్యాలయ సమావేశ భవనంలో మంగళవారం ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమల క్రమబద్ధీకరణ పథకంపై అవగాహన కల్పించారు. ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్లు నాగరాజు, అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకొని వ్యాపార, పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలన్నారు. ఎలాంటి ష్యూరిటీ లేకుండా 35 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు.

# పేదలకు వరం 'జగనన్న సురక్ష'

**మడకశిర/గుడిబండ:** చిన్న చిన్న కారణాలతో కొంత మంది పేదలకు అర్హత ఉన్నా సంక్షేమ పథకాలు అందలేదు... అలాంటి వారికి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఓ వరమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. పట్టణంలోని సాయినగర్, మాశీరొప్ప వార్డు సచివాలయాలకు సంబంధించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరిగింది. అలాగే గుడిబండ మండలం కరికెర గ్రామ పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ నరసయ్య కూడా పాల్గొన్నారు. ఆ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ పారదర్శకంగా సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పీడీ నరసయ్య మాట్లాడుతూ అర్హులకు న్యాయం చేయడానికే ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. అనంతరం వారు వివిధ సర్టిఫికెట్లను లబ్ధిదారులకు అందించారు.

**చిలమత్తూరు:** సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు పొందని అర్హులకు న్యాయం చేసేందుకు సీఎం జగన్ 'జగనన్న సురక్ష' ద్వారా న్యాయం చేస్తున్నారని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపల్లిలో సర్పంచ్ చామంతి అధ్యక్షతన నిర్వహించిన ''జగనన్న సురక్ష'' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఇక్బాల్ మాట్లాడుతూ ఓటు వేసినా, వెయ్యకపోయినా రాష్ట్రంలోని అర్హత ఉన్న వారందరికీ సీఎం వైఎస్ జగన్ న్యాయం చేస్తున్నారని తెలిపారు. దేశంలో గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన ఏకైక ముఖ్యమంత్రి ఒక్క జగన్‌మోహన్‌రెడ్డే అన్నారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు 650 తప్పుడు హామీలు ఇచ్చి ప్రజలను నట్టేట ముంచారన్నారు. ఇప్పుడు కర్ణాటకలో కాంగ్రెస్ హామీలు, రాష్ట్రంలో జగన్ హామీలను కాపీ కొట్టి ప్రజలకు బురిడీ కొట్టించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. కార్యక్రమంలో మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, , సర్పంచ్ చామంతి, ఎంపీటీసీ జగన్మోహన్‌రెడ్డి, మంజునాథ్‌రెడ్డి, సుధాకర్, సర్పంచ్‌లు తిరుమలేష్, మురళీమోహన్, వైస్ ఎంపీపీ బయప్ప, కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మడకశిర: సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



చిలమత్తూరు: లబ్ధిదారునికి సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

**లేపాక్షి:** మండలంలోని మానేపల్లి గ్రామ సచివాలయం ఆవరణంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్ జగనన్న సురక్ష ఆవశ్యకతను వివరించారు. 579 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశామన్నారు.

**పెనుకొండ రూరల్:** వందకు వందశాతం సంక్షేమ పథకాలు అమలు పరిచేందుకే జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ గీత తెలిపారు. మండలంలోని దుద్దేబండలో జరిగిన కార్యక్రమంలో 150 మందికి వివిధ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు.

**పరిగి:** అర్హత ఉండీ ఏళ్ల తరబడి ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేని వారికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పథకం వరమని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. మండలంలోని బీచిగానిపల్లిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ పంచాయతీలో 701 సర్టిఫికెట్లు అందించామన్నారు.

**రొద్దం:** ప్రజల సమస్యలు అక్కడికక్కడే సత్వర పరిష్కారం చేయడానికే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తహసీల్దార్ అనంతచారి, ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని చిన్నమంతూరు, చోళేమర్రి గ్రామ పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

**హిందూపురం టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజల కోసమే జగనన్న సురక్ష అనే బృహత్తర కార్యక్రమాన్ని తీసుకువచ్చారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని 1, 2, 3, 4, 5, 33, 39, 40వ సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. చైర్‌పర్సన్‌తో పాటు వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్‌లు పాల్గొని వివిధ వార్డుల్లో 2,446 సర్టిఫికెట్లను అందించారు.

**రొళ్ల:** 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎంపీపీ కవిత పేర్కొన్నారు. దొడ్డేరి సచివాలయం ఆవరణలో 'జగనన్న సురక్ష' పథకం కార్యక్రమం నిర్వహించి 214 మందికి సర్టిఫికెట్లు అందించారు.

**గోరంట్ల:** మండల పరిధిలోని గంగంపల్లి, కమ్మవారిపల్లి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ ప్రమీల , జెడ్పీటీసీ సభ్యులు పాలేజయరాంనాయక్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు.

**అగళి:** మండల పరిధిలోని అలుడి, ఆర్‌జీ పల్లి గ్రామ సచివాలయాల్లో ఎంఎల్‌ఓ ఓబులేసు జగనన్న సురక్షపై వలంటీర్లు, గృహసారథులకు జగనన్న సురక్ష కార్యక్రమం అవగాహన కల్పించారు.

**అమరాపురం:** మండల కేంద్రంలో మంగళవారం జగనన్న సురక్ష పథకం ద్వారా అర్హుల ఎంపికపై వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయం కన్వీనర్లు ఇంటింటా సర్వే చేపట్టారు. అలాగే మండలంలోని నిద్రగట్ట, మద్దనకుంటల్లో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీపీ ఈరన్న, వైస్.ఎంపీపీ క్రిష్ణమూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, సర్పంచు గోవిందరాయలు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించారు.

### సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న నాయకులు

**పెనుకొండ రూరల్:** మండల పరిధిలోని చంద్రగిరి గ్రామం నుంచి డ్యాముకు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని మంగళవారం ప్రారంభించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో రూ. 8 లక్షల వ్యయంతో 246 మీటర్లు పొడవున రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివశంకరప్ప, తహసీల్దార్ స్వర్ణలత, జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచ్ గౌతమి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగభూరు బాబు ,నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, నారాయణరెడ్డి, రఘునాథరెడ్డి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

**కళ్యాణదుర్గం:** కళ్యాణదుర్గం– గుండ్లపల్లి గ్రామాల మధ్య మంగళవారం ఉదయం రాయదుర్గం వైపు నుంచి కళ్యాణదుర్గం వస్తున్న బైకును ఆటో ఢీ కొంది. ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. మడకశిర మండలం కొత్తాలం గ్రామానికి చెందిన భాస్కరప్ప, రంగమ్మ దంపతులు ద్విచక్రవాహనంలో రాయదుర్గంలోని బంధువుల ఇంటికి వచ్చారు. మంగళవారం ఉదయం స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. గుండ్లపల్లి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న ఆటో బైకును ఢీకొంది. ఘటనలో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రంగమ్మ తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. బెళుగుప్ప పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## చంద్రబాబు ప్రజలకు చేసిందేమీలేదు

- ప్రజలు గుర్తుపెట్టుకునేలా ఒక్కపనైనా చేశారా ?
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



మోరుబాగల్‌లో లబ్ధిదారులకు సంక్షేమ క్యాలెండర్ అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

**గుడిబండ:** 'గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు దొంగ హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన చంద్రబాబు మరోసారి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారు.. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న ఏ ఒక్క పని ప్రజలు గుర్తుండిపోయేలా చేయలేదు.. అందువల్లే బాబును ప్రజలు తిరస్కరించారు'. అని ఎమ్మెల్యే తిప్పేస్వామి విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నవరత్నాలు పక్కాగా అమలు చేస్తుండటంతో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందన్నారు. మంగళవారం మండల పరిధిలోని మోరుబాగల్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేకు ఎంపీపీ రాధమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు భూతరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూనే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందాయా? లేదా? అనే విషయంపై లబ్ధిదారులను ఆరాతీశారు. పొలాలకు వెళ్లే రహదారులు అభివృద్ధి చేయాలని రైతులు కోరారు. ఇళ్లు మంజూరు చేయాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇచ్చిన హామీలలో 95 శాతం అమలు చేశారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి అర్హత ఉంటే చాలు పార్టీలు, కుల, మతాలు చూడకుండా ప్రతి ఒక్కరికీ పింఛన్ అందిస్తున్నారని గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా పింఛన్ వచ్చేది కాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామారావు, తహసీల్దార్ నాగభూషణం, ఈఓఆర్డీ నాగరాజు నాయక్, ఏపీఎం ముత్యాలప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రవి, సర్పంచ్‌లు యంజారేగౌడు, రంగస్వామి, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి కె.శివకుమార్, బీసీ, ఎస్సీ సెల్ కన్వీనర్‌లు పాండు, రమేష్, నాయకులు రమేష్ పాల్గొన్నారు.

### భార్యపై దాడిచేసిన కేసులో భర్త అరెస్టు

**పెనుకొండ:** మండలంలోని కొండంపల్లిలో 2022 అక్టోబర్ 10న భార్యపై దాడి చేసిన కేసులో ముద్దాయి చంద్రానాయక్‌ను మంగళవారం అరెస్ట్ చేశామని హెడ్ కానిస్టేబుల్ దాదాపీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలమేరకు... కొండంపల్లికి చెందిన చంద్రానాయక్ తన భార్య భారతిని తీవ్రంగా గాయపర్చాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశామని చెప్పారు. అయితే చంద్రానాయక్ పరారీలో ఉండగా మంగళవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరపరచి రిమాండ్‌కు తరలించామన్నారు.

### కొల్హాపురి మహాలక్ష్మికి పూజలు



అలంకరణలో మహాలక్ష్మి

**రొళ్ల:** రత్నగిరి గ్రామంలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని కొలిచే భక్తులు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు.

## భక్తిశ్రద్ధలతో జ్యోతుల ఉత్సవం

**రొద్దం:** మండల పరిధిలోని పెద్దిపల్లిలో వెలసిన గ్రామ దేవత కొల్లాపురమ్మదేవి మంగళవారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు జ్యోతులు మోసి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవంలో ఎమ్మెల్సీ సానిపల్లి మంగమ్మ, ఎమ్మెల్యే సోదరుడు మాలగుండ్ల మల్లికార్జున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే నారనాగేపల్లిలో స్వప్పలమ్మకు జ్యోతుల ఉత్సవం నిర్వహించారు.



నారనాగేపల్లిలో స్వప్పలమ్మకు జ్యోతులు మోస్తున్న మహిళలు

## మైనార్టీల అభ్యున్నతికి కృషి

**హిందూపురం టౌన్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తోందని జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్ మొగల్ నూరుల్లా అన్నారు. మంగళవారం పట్టణ, మండల పరిధిలోని 12వ వార్డులో, కిరికెర, కొటిపి, ఇస్లాంపురంలో ఉన్న మసీదుల్లో హర్ దిల్‌మే వైఎస్సార్, హం సబ్ జగన్‌కే సాత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మసీద్‌లలో మౌజన్ జీతభత్యాలు, మసీదుకు కావాల్సిన సదుపాయాలను గురించి చర్చించి సమస్యలను మైనార్టీ వెల్ఫేర్ కార్పొరేషన్‌కు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డ్ మెంబర్ ఇమ్రాన్, కౌన్సిలర్ అన్సర్‌కాన్, కోఆప్షన్ మెంబర్ ఫకృద్దీన్ సద్దాం, వక్ఫ్ బోర్డు మెంబర్ రియాజ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మహబూబ్, బాబాఫకృద్దీన్, ముజాహిద్, నవీద్ ఖాన్, భక్తర్ వలీ, మసీదు పెద్దలు మహబూబ్‌బాషా, ఇమామ్, మౌలానా జలీయుల్లా తదితరులు పాల్గొన్నారు.



ముస్లిం మైనార్టీలకు అందించిన సంక్షేమ వివరాలను ప్రదర్శిస్తున్న దృశ్యం

## 'అల్లూరి'కి ఘన నివాళి

**హిందూపురంటౌన్/పరిగి/చిలమత్తూరు:** బ్రిటీష్ తెల్లదొరలను గుండెధైర్యంతో ఎదుర్కొన్న మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని వక్తలు తెలిపారు. పరిగి మండలంలోని పెద్దిరెడ్డిపల్లి క్రాస్ బస్టాండ్ ప్రాంగణం, హిందూపురంలోని ఆర్‌అండ్‌బీ బంగా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో, చిలమత్తూరు మండల కేంద్రంలోని గ్రంథాలయంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు గొప్పతనాన్ని వివరించారు.




పరిగి: అల్లూరి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎంఈఓ లక్ష్మీదేవి తదితరులు

### ముగ్గురికి గాయాలు

**పెనుకొండ:** పట్టణ సమీపంలో మెడికల్ కాలేజ్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. సోమందేపల్లికి చెందిన మహేష్, నరసింహ, శివలు కారులో రొద్దం మండలం పెద్దిపల్లికి వెళ్లి అక్కడ పని ముగించుకుని కారులో తిరిగి వస్తుండగా మెడికల్ కాలేజ్ వద్ద కారు అదుపు తప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. నరసింహులు తీవ్రంగా గాయపడగా, మహేష్, శివలకు స్వల్ప గాయాలయ్యాయి.



### కుమార్తె ఆచూకీ కోసం నిరసన

**పెనుకొండ:** 'తమ కుమార్తె అదృశ్యమై 23 రోజులు అవుతున్నా ఇంత వరకు ఆచూకీ తెలియడం లేదు... వెంటనే తమకు న్యాయం చేయాలి' అంటూ పట్టణానికి చెందిన చిన్నారి షఫియా (03) తల్లిదండ్రులు ఖలీల్, రేష్మా వారి బంధువులు, సీపీఐ శ్రీరాములు తదితరులు అంబేడ్కర్ సర్కిల్లో మంగళవారం ధర్నా చేశారు. దర్గాపేటకు చెందిన షఫియా అదృశ్యం కాగా పోలీసులు పలు ప్రాంతాల్లో గాలిస్తున్నారు. అయినా ఆచూకీ మాత్రం తెలియరాలేదు. ఈ నేపథ్యంలో కుటుంబ సభ్యులు ధర్నా చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడగా కియా ఎస్ఐ వెంకటరమణ ఘటనా స్థలానికి చేరుకుని పాప ఆచూకీ కనుగొంటామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

### కూలిన కాంప్లెక్స్ గోడ పరిశీలన

**హిందూపురం టౌన్:** పట్టణంలోని వైఎస్సార్ పరిగి బస్టాండ్‌లో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ సజ్జా వర్షానికి కూలిపోయింది. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ కూలిన గోడను పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా శిథిలాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

### కర్ణాటక మద్యం పట్టివేత

**రొద్దం:** మండలంలోని సానిపల్లి, చోళేమర్రి గ్రామాల్లో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. సానిపల్లికి చెందిన అప్పాజి వద్ద నుంచి 50 మద్యం టెట్రా పాకెట్లు, గొబ్బరంపల్లికి చెందిన సిద్దప్ప వద్ద నుంచి 65 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. అప్పాజీకి చెందిన ద్విచక్ర వాహనం సీజ్ చేసినట్లు తెలిపారు.

### వైభవంగా కోదండరామస్వామి జాతర



కోదండరామస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

**పావగడ:** తాలూకా లోని అరసికెరలో వెలసిన గుజ్జారి ఆంజనేయస్వామి, కోదండరామస్వామి జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా సీతా రామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాలను గ్రామం ప్రధాన వీధుల్లో ఘనంగా ఊరేగించారు.

### ఘనంగా మారెమ్మ జాతర

**అగళి:** మండలంలోని ఇరిగెపల్లి, మధుడి గ్రామలలో కోల్లాపురి మహలక్ష్మి , మారెమ్మ జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారిని మేళతాళాలతో ఆయా గ్రామాల్లో ఊరేగించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జ్యోతులు సమర్పించారు.

### ఆర్బీకేల్లో పంటల బీమా జాబితా ప్రదర్శన

**మడకశిర:** నియోజకవర్గంలోని ఆర్బీకేల్లో 2022 ఖరీఫ్‌కు సంబంధించిన ఉచిత పంటల బీమా జాబితాలను ప్రదర్శించినట్లు స్థానిక ఏడీఏ కృష్ణమీనన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు జాబితాల్లో తమ పేర్లు ఉన్నాయో లేదో చూసుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని వేరుశనగ, కంది, రాగి, మొక్కజొన్న, బత్తాయి పంటలకు రూ.14.44 కోట్ల బీమా మంజూరైనట్లు తెలిపారు.

### చైతన్య యాత్రను విజయవంతం చేయండి

**పెనుకొండ:** మాదిగల రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు రామాంజప్ప, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కుంటిమద్ది ఓబులేసు తెలిపారు. పట్టణంలోని ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడారు. మాదిగల రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్లో ఈనెల 10న సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

### వ్యక్తికి తీవ్రగాయాలు

**అగళి:** మండల పరిధిలోని జాతీయ రహదారిపై మంగళవారం దాబా సమీపాన ఓమిని ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఘటనలో వన్నారనపల్లి గ్రామానికి చెందిన మంజునాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా మంజునాథ్‌ను రొళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

### రోశయ్యకు ఘన నివాళి

**హిందూపురం టౌన్:** దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యకు కాంగ్రెస్ పార్టీ నాయకులు నివాళులర్పించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాలాజీ మనోహర్ ఆధ్వర్యంలో రోశయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి సేవలను కొనియాడారు. నాయకులు అమానుల్లా, యూనుస్, జమీల్, అయాజ్, లక్ష్మీరెడ్డి, నరసింహ, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.